క్లుప్తంగా

సురవరం మృతి తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే జంకె



మార్కాపురం టౌన్: సీపీఐ అగ్రనేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బాధాకరమని వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అన్నారు. ఆయన పార్లమెంటు సభ్యుడిగా చేసిన సేవలు గుర్తుచేశారు. వారి కుటుంబ సభ్యులకు జంకె తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి

మార్కాపురం: ఇసుక యార్డు కాంట్రాక్టర్లతో ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్పీ దామోదర్‌కు పట్టణంలోని లారీ అసోసియేషన్ అధ్యక్షుడు బొందిలి కాశీ రాంసింగ్ శనివారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కొన్నేళ్లుగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నానని, ఇటీవల ఇసుక యార్డు సిబ్బందితో మనస్పర్థలు వచ్చాయని పేర్కొన్నారు. టన్ను ఇసుకకు రూ.950 ఇస్తామని చెప్పి రూ.800 మాత్రమే ఇస్తుండటంతో నిరసన వ్యక్తం చేశామని పేర్కొన్నారు. ఇసుక యార్డు సిబ్బందికి తమకు లావాదేవీల విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారి ఇంటి వద్దకు లారీ తీసుకెళ్లగా విషయం తెలుసుకున్న యార్డు సిబ్బంది అన్‌లోడ్ చేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. అనంతరం లారీని పోలీసుస్టేషన్‌కు తీసుకు రావాలని పోలీసులతో తమపై ఒత్తిడి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రవాణాపై పోలీసులు, మైనింగ్ అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, యార్డు నిర్వాహకులు, కూటమి నాయకులు కలిసి సుమారు 10 మంది తమను చంపుతామని బెదిరించారని, తమకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు



చక్కెర ప్యాకెట్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ మొహసిన్

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో మార్కాపురం తూనికలు, కొలతల అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. కొమరోలులోని పలు దుకాణాలను తనిఖీలు చేశారు. ఒక సూపర్ మార్కెట్, 2 కిరాణా షాపులపై దాడులు నిర్వహించి నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు. ఈసందర్భంగా మార్కాపురం తూనికల, కొలతల ఇన్‌స్పెక్టర్ మొహసిన్ మాట్లాడుతూ ప్రతిఏడాది కాటాలకు అనుమతులు పొందాలని తెలిపారు. ఎవరైనా ప్యాకెట్లలో కిరాణా సరుకులను అమ్మినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరి వెంట సహాయకులు శేఖర్, నారాయణ పాల్గొన్నారు.

పంట పొలాల్లో పులి జాడలు లేవు

కంభం: మండలంలోని సూరేపల్లి, ఔరంగబాదు గ్రామాల పరిధిలోని పంటపొలాల్లో పులి సంచారం లేదని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆనందరావు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఏనుగుకొండ సమీపంలోని పంట పొలాల్లో పులి పాదముద్రలు న్నాయంటూ రైతులు చెప్పడంతో ఫారెస్టు అధికారులు ట్రాప్ కెమెరాలు బిగించి పరిశీలించగా ఎటువంటి పులి జాడలు కనిపించలేదన్నారు. ఆ పాదముద్రలు కుక్కజాతి జంతువులై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఏవైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇస్తే మళ్లీ పరిశీలిస్తామని తెలిపారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



టంగుటూరికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తర్లుపాడు: ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని మండలంలోని జగన్నాథపురం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం జగన్‌బాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను విద్యార్థులకు వివరించారు. సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ ఆయన చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు.

కేజీబీవీ తనిఖీ

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీని జీసీడీఓ హేమలత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాపదం ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు డైలీ కండక్ట్ చేస్తున్న పరీక్షలు, అసైన్మెంటు గురించి ప్రిన్సిపాల్ మారుతీదేవీని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ బుక్ చెక్ చేశారు. మౌలిక వసతులతో పాటు వంటశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థినులకు జీసీడీఓ సూచించారు.



విగ్రహాలను కొనుగోలు చేసేందుకు చూస్తున్న ప్రజలు



వైజంక్షన్ వద్ద విక్రయానికి ఉంచిన విగ్రహాలు

సిద్ధమైన గణనాథులు

- నిబంధనలు పాటించాలంటున్న పోలీసులు
- కంభంలో హైవేపై మూడు చోట్ల విగ్రహాల అమ్మకాలు
- 28న కంభం చెరువులో నిమజ్జనం

కంభం: వినాయక చవితి వేడుకలకు గణనాథులు సిద్ధమయ్యాయి. చారిత్రాత్మక కంభం చెరువులో వినాయక నిమజ్జన వేడుకలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువులో ప్రస్తుతం 7 అడుగుల మేర నీళ్లు ఉండటంతో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లోని గ్రామాల నుంచి సుమారు 200 విగ్రహాలకు పైగా నిమజ్జనానికి కంభం చెరువుపైకి తరలి వస్తాయి. ఈ నెల 27వ తేదీ పండుగ చేసుకొని 8వ తేదీ కంభం చెరువులో నిమజ్జనాలు జరగనున్నాయి. గ్రామోత్సవం రోజు పట్టణం మొత్తం గణేష్ నామస్మరణతో మారుమోగిపోతుంది. పట్టణంలో కోలాహలంగా గ్రామోత్సవం కంభం చెరువు వద్దకు చేరుకొని చెరువులో వినాయక నిమజ్జనం చేపడతారు. గ్రామోత్సవం చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వస్తారు. కంభం చెరువుకట్టను శనివారం మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు పరిశీలించి సీఐ మల్లిఖార్జున, ఎస్సై నరసింహారావులకు పలు సూచనలు చేశారు.

మూడు చోట్ల విగ్రహాల అమ్మకాలు:
పట్టణంలోని హైవేలో మూడు చోట్ల విగ్రహాల అమ్మకాలు జరుగుతున్నాయి. విగ్రహాల సైజు 4 అడుగుల నుంచి 11 అడుగుల వరకు తయారు చేశారని, వాటి ధర రూ.8 వేల నుంచి రూ.48 వేల వరకు ఉందని వ్యాపారులు చెబుతున్నారు. చాలా మంది ఇప్పటికే బొమ్మలకు అడ్వాన్సులు చెల్లించి బుక్ చేసుకున్నట్లు వ్యాపారులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన శివ 17 ఏళ్లుగా కంభంలో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తుండగా ఇతనితో పాటు హైవే రోడ్డులోని వైజంక్షన్ దగ్గర ఇద్దరు వ్యాపారులు విగ్రహాలు విక్రయిస్తున్నారు. పండుగ లోపు మొత్తం విగ్రహాలు అమ్ముడవుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల నిబంధనలు ఇలా...
వినాయక విగ్రహ ప్రతిష్ట/మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. విగ్రహాల ఎత్తు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జన మార్గం, వాహనాల వివరాలు తెలపాలి. ప్రైవేటు స్థలమైతే యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ అనుమతి తీసుకొని అనుమతి పత్రం పోలీస్ వారికి అందజేయాలి. రహదారులకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా విగ్రహాలు పెట్టరాదు. పెద్ద పెద్ద బ్యానర్లు, ఫ్లెక్సీలు, రెచ్చగొట్టేలా బ్యానర్లు పెట్టరాదు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతులు తప్పనిసరి తీసుకోవాలి. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలి. మసీదుల్లో నమాజు సమయంలో పాటలు పెట్టరాదు. మసీదుల వద్ద గులాములు చల్లరాదు, మతపరమైన పాటలు పెట్టరాదు. గ్రామోత్సవంలో అసభ్యకరమైన డ్యాన్సులు, ఇతర ప్రదర్శనలు నిర్వహించరాదు.



కంభం చెరువు వద్ద సీఐ, ఎస్సైలకు సూచనలిస్తున్న డీఎస్పీ నాగరాజు

ఆశాజనకంగా అమ్మకాలు



మొత్తం 190 విగ్రహాలు తయారు చేశాను. సగానికి పైగా విగ్రహాలు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది ఆశాజనకంగా అమ్మకాలు జరుగుతున్నాయి. విగ్రహాల తయారీకి సుమారు 5 నెలలు పడుతుంది. రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టాను. మొత్తం అమ్మడైతే పెట్టుబడి, ఖర్చులు పోను రూ.నాలుగైదు లక్షలు మిగులుతాయి.
– శివ, విగ్రహాల తయారీదారుడు

విగ్రహాలు తక్కువ ఎత్తులో ఉండేలా చూసుకోవాలి



వినాయకుడి విగ్రహాలు తక్కువ ఎత్తులో ఉండేలా చూసుకోవాలి. గ్రామోత్సవంగా వెళ్లే సమయంలో కరెంటు తీగలు తగిలే అవకాశం ఉంటుంది. చెరువుకట్ట సమీపంలో ట్రాక్ వద్ద ఎత్తు ఎక్కువగా ఉంటే పైకి తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుంది. వీలైనంత వరకు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించుకునేందుకు దృష్టి సారించాలి.
– కె.మల్లికార్జున, సీఐ, కంభం

కమిటీ సభ్యులు బాధ్యత వహించాలి



వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే నిర్వాహకులు, కమిటీ సభ్యులు విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం జరిగే వరకు పూర్తి బాధ్యత తీసుకోవాలి. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అవసరమైన అన్ని అనుమతులు తీసుకొని, నియమ నిబంధనలు పాటిస్తూ వినాయకచవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి.
– బి.నరసింహారావు, కంభం ఎస్సై

చెన్నకేశవునికి శాంతి పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న న్యాయమూర్తి భరత్ చంద్ర



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్

● స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి శనివారం శాంతి పూజలను ఆలయ అర్చకులు అప్పనాచార్యులు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవ స్వామి వారిని గిద్దలూరు కోర్టు న్యాయమూర్తి భరత్ చంద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్రను న్యాయమూర్తికి అర్చకులు వివరించారు. అనంతరం న్యాయమూర్తిని శేష వస్త్రాలతో సన్మానించారు. భక్తులు చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
కంభం రోడ్డులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి శనివార ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారిని పూలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రమేష్ తదితరులు పాల్గొని భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మెడికల్ కాలేజీ పనులు పునఃప్రారంభించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంకల్పవేదిక నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురంతో పాటు రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలల పనులను పూర్తి చేసి వాటిని ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు ఎం.రంగసాయిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మార్కాపురం మెడికల్ కళాశాల వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి ప్రజా సంకల్ప వేదిక నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పుల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన మెడికల్ కాలేజీలను స్థాపించి అందుకు రూ.8,480 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తు చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేశారని, అయితే వాటిలో 5 కళాశాలల ద్వారా 2023–24 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించారని, తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు విద్యార్థులు పొందారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నేతృత్వంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే ప్రణాళికను పున:పరిశీలించాలని కోరారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల అవసరమని, ఈ మేరకు నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కళాశాలల నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. నిలిచిపోయిన కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధక విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జి.శివారెడ్డి, సమాచార హక్కు విభాగ రాష్ట్ర సలహాదారులు మల్లికార్జున, నాయకులు మహ్మద్ గౌస్, పవన్‌కుమార్, బాలు పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనుల్లో కొరవడిన పర్యవేక్షణ



పట్టణంలో మెయిన్ రోడ్డులో కాలువల్లో మురుగు తీసి గతంలో పోసిన దానిపైనే పోసిన దృశ్యం

కంభం: ఇరిగేషన్ కాలువల్లో మురుగు తొలగించే పనులపై పర్యవేక్షణ కొరవడి ప్రజాధనం వృథా అవుతోంది. ఈ ఏడాది మొదట్లో సుమారు రూ.40 లక్షలతో పట్టణంలోని పలు ఇరిగేషన్ కాలువల్లోని మురుగు తొలగించే కార్యక్రమం చేపట్టిన అధికారులు కొన్ని చోట్ల తొలగించిన మురుగు తరలించగా చాలా చోట్ల కాలువల పక్కనే అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో మరో మారు నిధులు మంజూరు కావడంతో అదే ఇరిగేషన్ కాలువల్లో మళ్లీ మురుగు తొలగించే పనులు చేపట్టి మురుగును తీసి కాలువల పక్కన గతంలో పడేసిన దానిపైనే పడేస్తున్నారు. మురుగంతా రోడ్డుపైకి పారి రాకపోకలు సాగించే పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కందులాపురం సెంటర్ నుంచి పట్టణంలోకి వెళ్లే రహదారి, గౌతమి కాలేజ్ కి వెళ్లే రోడ్డుపై మురుగురోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించారు. ఏడాది తిరగకముందే రెండు సార్లు కాలువల్లో మురుగు తొలగించే కార్యక్రమం చేపట్టినప్పటికీ పర్యవేక్షణ లోపించడంతో పనుల్లో నాణ్యత కనబడటం లేదన్న విమర్శలొస్తున్నాయి. ప్రస్తుతం రూ.46 లక్షలు మంజూరు కాగా 5 పంట కాల్వల్లో మురుగు తొలగించి, తూముల వద్ద చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తున్నారు. కాంట్రాక్టర్లు జేబులు నింపుకోవడానికి తప్పనిస్తే ప్రజలకు, రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బోగోలులో మినుము పంట ప్రదర్శన క్షేత్రం

అర్ధవీడు: మండలంలోని బోగోలు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో మినుము పంట క్షేత్ర ప్రదర్శన శనివారం ఏఓ శివ గంగప్రసాదు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినుము పంట పూత దశలో ఉన్నందున తెల్ల దోమ ఆశించకుండా సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. అసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా వేప నూనె 500 ఎంఎల్ ఒక ఎకరానికి కలుపుకొని పిచికారి చేయాలని తెలిపారు. దీనివలన మినుము పంటలో పల్లాకుల తెగులు సమస్య నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగిరెడ్డి వెంకటరెడ్డి, వీఏఏ హస్మతు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

పొదిలి రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో జరిగే పారిశుధ్య పనులు మెరుగుపర్చుకోవాలని ఎంపీడీఓ శోభన్‌బాబు ఆదేశించారు. శనివారం మండలంలోని ఉప్పలపాడులో జరుగుతున్న స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోజూ ఉదయం 7 గంటలకే కార్మికులు క్షేత్రస్థాయిలో పని చేసేలా చూడాలన్నారు. ఎక్కడెక్కడ మురుగు నిల్వ ఉంటుందో గుర్తించి ఆ ప్రదేశాలను శుభ్రం చేయాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగహన కల్పించాలని కోరారు. ఆటోల్లో ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టుకు తరలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం
బేస్తవారిపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో వ్యాధుల బారినుంచి రక్షణ పొందవచ్చని తహసీల్దార్ జితేంద్రకుమార్ అన్నారు. స్థానిక పంచాయతీలో శనివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధిచెందడంతో అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. గృహ పరిసరాల్లో ఖాళీ కొబ్బరిబొండాలు, టైర్లు పెట్టుకోవడంతో వర్షం నీరు నిల్వ ఉండి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జిలానీబాషా, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్ధవీడు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ కే వీరరాజు అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం అర్ధవీడులో నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి బి.ఏడుకొండలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో హజరయ్య, శేషమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, హరిత రాయబారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మండలంలోని రాయవరంలో డివిజన్ అభివృద్ధి అధికారి, స్పెషలాఫీసర్ డి.బాలూనాయక్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, కార్యదర్శి మోహన్‌రావు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: శుభ్రత పై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుభ్రత పరిశుభ్రత పై శనివారం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం పంతులు 153 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కమిషనర్ ఈ.వి.రమణ బాబు, తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

● డీఎస్పీ నాగరాజు



కంభంలో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

కంభం: వినాయకచవితి పండుగను, విగ్రహాల నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు సూచించారు. ఈనెల 27న వినాయకచవితి, 28వ తేదీన కంభం చెరువులో నిమజ్జన వేడుకలు జరగనున్న నేపథ్యంలో శనివారం కంభం పోలీస్ స్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో శాంతి సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసుకున్న కమిటీ సభ్యులు నిమజ్జనం పూర్తయ్యే వరకు పరిరక్షించుకోవాలన్నారు. పార్టీలకు సంబంధించిన పాటలు, సినిమా పాటలు, రెచ్చగొట్టే పాటలు పెట్టకుండా భక్తి పాటలు పెట్టుకొని గ్రామోత్సవం జరుపుకోవాలన్నారు. ఫైర్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారుల సూచనలు, అనుమతులు తీసుకొని వారి సూచనలు పాటించాలన్నారు. ఎవరో ఒకరిద్దరు మద్యం తాగి చేసిన తప్పిదాల వల్ల చెడ్డపేరు వస్తుందని అటువంటి సంఘటనలు జరగకుండా కమిటీ వారు చర్యలు తీసుకోవాలన్నారు. మతపెద్దలు పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఇతర మతాలను గౌరవిస్తూ గ్రామోత్సవం నిర్వహించుకుంటామని పలువురు కమిటీ సభ్యులు పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో సీఐ కె.మల్లికార్జున, తహసీల్దార్ వి. కిరణ్, ఎస్సై నరసింహారావు, పలువురు పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఓంకార్

గిద్దలూరు రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామ సమీపంలోని సెయింట్ జాన్సన్ స్కూల్, సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాల గురించి తెలుసుకోవడం వల్ల సమాజంలో ఎలా ప్రవర్తించాలో తెలుస్తుందన్నారు. న్యాయవ్యవస్థ ఉపయోగాలను గుర్తించాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరి పై ఉందని చెప్పారు. అనంతరం ముండ్లపాడు ఎస్సీ వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశాడు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లు తొలగిస్తారా?

పొదిలి: సదరం సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం రాష్ట్రంలో లక్షా ఎనిమిది వేల మంది పింఛన్లు తొలగించారని దివ్యాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మదార్‌వలి మాట్లాడుతూ అనర్హులని పింఛన్లు తొలగించారు సరే, అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులపై చర్యలు ఉండవా.. అంటూ ప్రశ్నించారు. జిల్లా మెడికల్ బోర్డు అథారిటీ వారు ఇచ్చిన సదరం సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్ చేయాలంటే ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డు అథారిటీ విశాఖపట్టణం వారు చేయాలని జీఓఎంఎస్ నెంబర్ 54 ద్వారా తెలుస్తుందన్నారు. రీవెరిఫికేషన్‌లో భాగంగా అవగాహన లేని కొంత మంది వైద్యులు అర్హులను కూడా అనర్హులుగా చూపారన్నారు. దీన్ని హక్కుల సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రీవెరిఫికేషన్‌కు హాజరు కావాల్సిన వారు రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ఉండగానే హడావుడిగా ఆగమేఘాలపై అనర్హుల జాబితా ప్రకటించటం ద్వారా దివ్యాంగులు మానసిక వేదనకు గురయ్యారన్నారు. ఇక పింఛన్ రాదేమోననే వేదనలో కుగిపోతున్నారన్నారు. రీవెరిఫికేషన్ పేరున అర్హుల పింఛన్‌లు తొలగిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమితి సభ్యులు మందుల కృష్ణ, సయ్యద్ ఆరిఫా, సుభానీ, సయ్యద్, రజాక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధిపై దృష్టిసారించండి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధిపై దృష్టిసారించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి. చెంచిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మార్కాపురం మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పదవులు పొందిన నాయకులు కార్యకర్తలకు అండగా ఉండి ఏ కష్టం వచ్చినా ఆదుకోవాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు నాయకత్వంలో అందరూ పనిచేయాలన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి అభివృద్ధి విషయంలో జరుగుతున్న తేడాను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, నల్లబోతుల కొండయ్య, బట్టగిరి తిరుపతిరెడ్డి, బండి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు చెంచిరెడ్డి